# శరవేగంగా మహిళా భవన నిర్మాణం



చెన్నూర్ పట్టణంలో కొనసాగుతున్న మహిళా భవన నిర్మాణ పనులు

చెన్నూర్, డిసెంబర్ 8: చెన్నూర్‌లో చేపట్టిన మహిళా భవన నిర్మాణం పనులు శర వేగంగా సాగుతున్నాయి. మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలనే గొప్ప లక్ష్యంతో అప్పట్లో ప్రభుత్వ మాజీ విప్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నియోజకవర్గ కేంద్రమైన చెన్నూర్ పట్టణంలో 'సమ్మక్క-సారలక్క' పేరుతో మహిళా భవనాన్ని నిర్మించాలని పూనుకున్నారు. దీంతో పట్టణంలో మహిళ భవన నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం ద్వారా రూ.1.50కోట్లు మంజూరు చేయించారు. నిధులు మంజూరు కావడంతో భవన నిర్మాణానికి మాజీ మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. దీంతో అప్పుడే భవన నిర్మాణ పనులు ప్రారంభం కాగా శర వేగంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం భవన నిర్మాణం గ్రౌండ్ ఫ్లోర్ పనులు జరుగుతుండగా, మొదటి అంతస్తు స్లాబ్ పనులు కూడా పూర్తయ్యాయి. ఈ మహిళా భవన నిర్మాణం పూర్తయితే స్వయం సహాయ సంఘాల సభ్యులకు (మహిళలకు) అందుబాటులోకి రానుంది. ఈ మహిళా భవనాన్ని జీ ప్లస్ వన్ అంతస్తుల్లో విశాలమైన హాలు, స్టోర్ రూం, ఆఫీస్ రూం, టాయిలెట్స్ ఉండేలా అన్ని వసతులతో నిర్మిస్తున్నారు. ఈ భవన నిర్మాణం పూర్తయితే మహిళల సృజనాత్మకతకు పదును పెట్టి వృత్తి నైపుణ్యాలకు ప్రోత్సహించేందుకు, సమావేశాలకు ఉపయోగ పడనున్నది.

## కాంట్రాక్ట్ నియామకాల్లో స్థానికులకే ప్రాధాన్యం

● చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

మందమర్రి, డిసెంబర్ 8: సింగరేణిలో కాంట్రాక్ట్ ఉద్యోగాల నియామకాల్లో స్థానికులకే ప్రాధాన్యత కల్పించేందుకు కృషి చేస్తానని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. చెన్నూర్ పర్యటనలో భాగంగా శుక్ర వారం ఉదయం మందమర్రి పట్టణానికి వచ్చిన ఎమ్మెల్యే స్థానిక కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. మొదట ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి స్థానిక పాలచెట్టు ఏరియాలో గల పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం సింగరేణి పాఠశాల వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. స్థానిక ఐఎన్‌టీయూసీ కార్యాలయంతో పాటు రెండవ జోన్‌లోని మాజీ విప్ నల్లాల ఓదెలు నివాసం వద్ద ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. తన గెలుపునకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని తెలిపారు. సింగరేణిలో కాంట్రాక్టు ఉద్యోగాల్లో ఎక్కువ శాతం స్థానికేతరులే ఉన్నా రనే విషయం తన దృష్టికి వచ్చిందని, భవిష్యత్‌లో జరిగే కాంట్రాక్టు ఉద్యోగాల నియామకాల్లో స్థానికులకు ప్రాధాన్యం దక్కేట్లు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మాజీ విప్ నల్లాల ఓదెలు, ఐఎన్‌టీయూసీ సెక్రటరి జనరల్ జనక్‌ప్రసాద్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్, కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ నాయకులు దేవి భూమయ్య, గుడ్ల రమేశ్, కాసర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి ఘన స్వాగతం**

రామకృష్ణాపూర్, డిసెంబర్ 8: చెన్నూర్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యేగా మొదటి సారి రామకృష్ణాపూర్ పట్టణానికి విచ్చేసిన గడ్డం వివేక్ వెంకటస్వామికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. బైక్ ర్యాలీలో పాల్గొని రామాలయం చౌరస్తాలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ కార్యాలయంతో పాటు వేర్వేరు సమావేశాల్లో మాట్లాడారు. తన విజయానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, నాయకులు రఘునాథరెడ్డి, గోపతి రాజయ్య, పల్లె రాజు, అబ్దుల్ అజీజ్, ఎండీ యాకూబ్‌అలీ, ఆకుల రాజయ్య, మారెపల్లి రాజయ్య, కార్యకర్తలు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ నాయకులు వీ. సీతారామయ్య, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, నాయకులు అక్బర్‌అలీ, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్ : అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

## లైంగిక వేధింపులకు గురైతే ఫిర్యాదు చేయాలి



మాట్లాడుతున్న మందమర్రి ఇన్‌చార్జి జీఎం రాజేశ్వర్ రెడ్డి

మందమర్రి, డిసెంబర్ 8: పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురైతే సంబంధిత ఇంటర్నల్ కమిటీ సభ్యులకు ఫిర్యాదు చేయాలని సింగరేణి మందమర్రి ఏరియా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ ఏ.రాజేశ్వర్ రెడ్డి మహిళా ఉద్యోగులకు సూచించారు. ఏరియా జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణ-2023 పై శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికే ఈ కమిటీని నియమించినట్లు తెలిపారు. మహిళా ఉద్యోగులు సంతోషకర వాతావరణంలో పనులు చేసుకుంటూ సంస్థ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. అనంతరం మహిళా ఉద్యోగులకు ఇంటర్నల్ కమిటీ సభ్యులు లైంగిక వేధింపుల నివారణ-2023పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీవైపీఎం మైత్రేయబంధు, ఇంటర్నల్ కమిటీ మెంబర్లు డీవైసీఎంవో ఉష, ఎస్టేట్ ఆఫీసర్ కుమారస్వామి, సింగరేణి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు అనుపమ, ఆఫీస్ సూపరింటెండెంట్ అనంతలక్ష్మి, జీఎం కార్యాలయ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన మహిళా ఉద్యోగులు

## పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలి


● ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్



కిష్టంపేట్ నర్సరీ పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

తాండూర్, డిసెంబర్ 8 : పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ కార్యదర్శులను, సిబ్బందిని ఆదేశించారు. ఏరియా ఆఫీసర్స్ ఆప్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా శుక్రవారం కిష్టంపేట్ గ్రామపంచాయతీని ఎంపీడీవో సందర్శించారు. నర్సరీ నిర్వహణపై పలు సూచనలు చేశారు. గ్రామపంచాయతీ పరిధిలోని తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదిక, మండల ప్రాథమిక పాఠశాల కాంపౌండ్‌వాల్, గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను సందర్శించారు. క్రీడా ప్రాంగణాల్లోని పిచ్చి మొక్కలను తొలగించాలని, గ్రామ పంచాయతీలోని పారిశుధ్య పనులను పరిశీలిస్తూ క్రమం తప్పకుండా గ్రామపంచాయతీలో పారిశుధ్య పనులను నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి బాబురావు, ఫీల్డ్ అసిస్టెంట్ బుచ్చయ్య ఉన్నారు.

## డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ కాంపల్లి శంకర్‌కు అభినందన



శంకర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మేకల గోపాల్

బెల్లంపల్లి, డిసెంబర్ 8: ఈ నెల 5, 6 7 తేదీల్లో హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో జరిగిన ఐటీ ఫర్ ఎఫెక్టివ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ శిక్షణ కార్యక్రమానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కాంపల్లి శంకర్ హాజరయ్యారు. కోర్సు డైరెక్టర్ కే.జ్యోతి, మేనేజర్ డాక్టర్ రావులపాటి మాధవి, డైరెక్టర్ జనరల్ డాక్టర్ శశాంక్ గోయల్ చేతుల మీదుగా శిక్షణ ధృవీకరణ పత్రాన్ని తీసుకున్నారు. కళాశాల నుంచి శిక్షణ పొందిన శంకర్‌ను శుక్రవారం కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మేకల గోపాల్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టీ.ఎస్.ప్రవీణ్‌కుమార్, అకాడమిక్ కో ఆర్డినేటర్ పీ శ్రీలత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, లెక్చరర్లు , బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు అండగా నిలవాలి



వృద్ధురాలికి దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

భీమారం, డిసెంబర్ 8 : పేదలకు అండగా నిలవాలని అలాంటి అప్పుడు మానవ జీవితానికి అర్థం ఉంటుందని పాస్టర్ సల్మాన్ రాజ్, సుధీర్ రాజ్ పేర్కొన్నారు. భీమారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీల్లో నివాసం ఉంటున్న జలంపల్లి తిరుపతి, జలంపల్లి సంజీవ్, వడ్ల కొండ జీవన్ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా సొంత ఖర్చులతో దుప్పట్లు విరాళంగా ఇవ్వగా వాటిని శుక్రవారం ఎస్సీ కాలనీకి చెందిన 50 మంది వృద్ధులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టరమ్మ నిర్మలమ్మ, సుగుణమ్మ, మాజీ ఎంపీటీసీ జలంపల్లి శ్రీ భూ లక్ష్మి, సంఘం సభ్యులు మల్లీశ్వరి, పరిమళ, పుష్ప, సబిత, సౌందర్య, సరమ్మా, శోభ తదిరులు పాల్గొన్నారు.

## సర్వ సభ్య సమావేశం రేపు

చెన్నూర్ టౌన్, డిసెంబర్ 8 : వయోవృద్ధుల సంక్షేమ సమాఖ్య సర్వ సభ్య సమావేశం ఈ నెల 10న నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బొలిశెట్టి రాజలింగు, సైండ్ల మొండయ్య తెలిపారు. 2023 సంవత్సరం పూర్తి కాబోతున్నందున సంఘం స్థితిగతులు, ఆర్థిక పరిస్థితులు, పాలకవర్గం సాధించిన పనులపై సమీక్ష ఉంటాయని వివరించారు. ఆదివారం ఉదయం 11 గంటలకు మంచిర్యాలలోని 'సన్ షైన్ డే కేర్ సెంటర్'లో బొలిశెట్టి రాజలింగు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎజెండా అంశాలతో పాటు అధ్యక్షుల అనుమతితో ఇతర అంశాల పై చర్చ ఉంటుందని తెలిపారు. సీనియర్ సిటిజన్ మిత్రులందరూ సకాలంలో వచ్చి, జయప్రదం చేయాలని వారు కోరారు.

## 11న జోనల్ స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు

బెల్లంపల్లి, డిసెంబర్ 8: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి అండర్-19 క్రికెట్ ఎంపిక పోటీలు ఈ నెల 11న ఉదయం 9 గంటలకు బెల్లంపల్లి ఏఎంసీ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బొంకూరి బాబురావు తెలిపారు. ఇంటర్మీడియట్ చదువుతూ 19 ఏళ్లు నిండిన విద్యార్థులు పోటీలకు అర్హులని పేర్కొన్నారు. సంబంధిత కళాశాల బోనఫైడ్, ఆధార్‌కార్డుతో సంప్రదించాలని సూచించారు. వివరాలకు గౌతం 7702514313, 9849922445 సంప్రదించాలని సూచించారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కోటపల్లి, డిసెంబర్ 8 : కోటపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పిన్నారం గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించి ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత ద్వారా డిజిటల్, నగరహిత లావాదేవీలు, సైబర్ నేరాలపై అవగాహన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, రైతులకు పంట రుణాలు, మహిళా సంఘాలకు పొదుపు, విద్యార్థులకు ఎడ్యుకేషన్ లోన్, గోల్డ్ లోన్‌పై ఆట, పాటలు, మాటల ద్వారా మ్యాజిక్ షో ద్వారా వివరించారు. ఈ కార్యక్రమం బ్యాంకు మేనేజర్ ప్రశాంత్, ఫీల్డ్ ఆఫీసర్ కుమార్, బ్యాంకు సిబ్బంది శ్రీకాంత్, ఖాతాదారులు, ప్రజలు పాల్గొన్నారు.

## మూడేళ్ల తర్వాత సింగరేణి దవాఖానాలో తొలి కాన్పు



మగశిశువుతో తల్లి, వైద్య సిబ్బంది

బెల్లంపల్లి, డిసెంబర్ 8: బెల్లంపల్లి సింగరేణి ఏరియా దవాఖానలో మూడేళ్ల సుధీర్ఘ కాలం తర్వాత శుక్రవారం ఒక డెలివరీ జరిగింది. కరోనా కాలంలో ఇక్కడి ప్రసూతి ఆపరేషన్ థియేటర్, వార్డును కరోనా కేంద్రంగా మార్చారు. దీంతో అప్పటి నుంచి డెలివరీలు జరగడం లేదు. ఇటీవలే సింగరేణి యాజమాన్యం ఆపరేషన్ థియేటర్‌ను మరమ్మతులు చేసి అత్యాధునికంగా తీర్చిదిద్దింది. కాసిపేట గనిలో జనరల్ మజ్దూర్‌గా పని చేస్తున్న కార్మికుడు అశోక్ భార్య మంజుల దవాఖానలో మగశిశువుకు జన్మనిచ్చింది. ఉదయం 10.4 గంటలకు ఆపరేషన్ థియేటర్‌లో మంజులకు సీజేరియన్ చేసి కాన్పు చేశారు. తల్లి, బిడ్డ ఇద్దరు ఆరోగ్యంగా ఉన్నారని గైనకాలజిస్ట్ అరుణజ్యోతి తెలిపారు. మూడేళ్ల తర్వాత సింగరేణి దవాఖానలో జరిగిన తొలి కాన్పు కావడం గమనార్హం. దవాఖానలో ప్రసూతి సేవలను పున:ప్రారంభించడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.